
క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కాజీపేట అర్బన్: సబ్‌స్టేషన్ మరమ్మతుల్లో భాగంగా హనుమకొండలోని మచిలీబజార్ 11 కేవీ సబ్‌స్టేషన్ ఫీడర్‌లో ఆదివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈఈ జి.సాంబరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని జయ కళాశాల, పద్మాక్షి కాలనీ, శివముక్తి ధామం, రాజ్‌పుత్ వాడ, మల్లికాంబ మనోవికాస కేంద్రం ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఆయన పేర్కొన్నారు.

నిట్ ఉద్యోగికి పీహెచ్‌డీ పట్టా



కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రంగీలాల్ భూక్య శనివారం నిట్ 22వ స్నాతకోత్సవంలో పీహెచ్‌డీ పట్టాను డీఆర్‌డీఓ చైర్మన్ సమీర్ వి.కామత్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈమేరకు ఆయనను నిట్ యాజమాన్యం అభినందించింది.

ఎంట్రప్రెన్యూర్ అవార్డు ప్రదానం



కాజీపేట అర్బన్: హనుమకొండకు చెందిన గోపి సెలూన్ యజమాని నాగవెల్లి సురేష్‌కుమార్‌కు బీఏసీసీఐ (బ్యాక్‌వర్డ్ క్లాసెస్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ) ఉత్తమ ఎంట్రప్రెన్యూర్ అవార్డును అందజేసింది. హైదరాబాద్‌లోని టీ హబ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన అవార్డు అందుకున్నారు.

సీఎం చొరవతోనే కోచ్ ఫ్యాక్టరీ

వరంగల్: కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తూర్పు ఎమ్మెల్యే, మంత్రి కొండా సురేఖ, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించడం వల్లనే స్థానిక ప్రజల కల సాకారం అవుతోందని వరంగల్ కాంగ్రెస్ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అయూబ్ ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ ప్రాంతంలో భారీ కార్మాగారం లేకపోవడంతో నిరుద్యోగులకు ఉపాధి లేకుండా పోయిందన్నారు.

కంప్యూటర్ గదులు నిర్మించాలి



వరంగల్: వరంగల్ చింతల్‌లో ఉన్న ఉర్దూ మీడియం స్కూల్‌కు సంబంధించిన బిల్లు ఇప్పించి ముస్లిం పిల్లల కోసం కంప్యూటర్ గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ అయుబ్ ఆధ్వర్యంలో చింతల్ 36 డివిజన్‌కు చెందిన నాయకులు సోయల్, చాంద్‌పాషా, తజ్ముల్ ఖాన్, ముస్లిం మత పెద్దలు అలీమ్, అంజాద్, యూనస్, అఫ్జల్, జావిద్ కోరారు. ఈమేరకు మంత్రి కొండా సురేఖను హైదరాబాద్‌లో శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు.

మన అగ్రిటెక్ సందర్శన

వరంగల్: ఏనుమాముల మార్కెట్‌ను కరీంనగర్‌కు చెందిన మహాత్మా జోతిరావు పూలే వ్యవసాయ కళాశాల విద్యార్థులు శనివారం సందర్శించారు. మార్కెట్‌లో మన అగ్రిటెక్ ఏర్పాటు చేసిన 365 రోజుల వ్యవసాయం పరికరాల ప్రదర్శనను తిలకించి, అగ్రిటెక్ అధినేత పాషికంటి రమేష్‌ను అడిగి తెలుకున్నారు.

భద్రకాళి దేవాలయంలో పూజలు



హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయాన్ని కుడా చైర్మన్ ఇనుగాల వెంక్రటాంరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ ఈఓ శేషు భారతి, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతించారు.

పర్యవేక్షకుడిగా కుడా చైర్మన్

నయీంనగర్: ప్రజాపాలన వారోత్సవాల హుజూరాబాద్ నియోజకవర్గ పర్యవేక్షకుడిగా కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్, తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

ఖిలా వరంగల్: వరంగల్ – నర్సంపేట రోడ్డులోని లేబర్‌కాలనీలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులిద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు కథనం ప్రకారం ఆటో దిగి రోడ్డు దాటుతున్న దంపతులను ఆటో ఢీకొట్టింది. దాంతో భార్యాభర్తలను ఆటోలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

కార్మికుల సంక్షేమమే ధ్యేయం

కాజీపేట రూరల్: రైల్వే కార్మికుల హక్కుల కోసం సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ నిరంతరం కృషి చేస్తోందని రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ జోనల్ ప్రెసిడెంట్ కాల్వ శ్రీనివాస్ అన్నారు.

వేగానికి తప్పదు శోకం

- రహదారులపై అతివేగంగా వెళ్తున్న బైకులు, కార్లు
- రోడ్డుపైకి రావాలంటే జంకుతున్న బాటసారులు, ప్రయాణికులు
- ప్రమాదం జరిగినప్పుడే అధికారుల హడావుడి
- పట్టించుకోని ఆర్టీఏ, పోలీసు అధికారులు



బైక్‌లపై అతివేగంగా వెళ్తున్న యువకులు

ఖిలా వరంగల్: మితిమీరిన వేగం, స్నేక్ డ్రైవింగ్, మద్యం మత్తులో వాహనాలు నడపడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. నిర్లక్ష్యమే వారి ప్రాణాలను బలిగొంటోంది. దాంతో వారి కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోతున్నాయి. గతంలో పోల్చుకుంటే ఇటీవల కాలంలో వరంగల్ నగర శివారు జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాలు తక్కువనే చెప్పొచ్చు. చాలా ప్రమాదాలు స్వయంకృపరాదంగా భావించొచ్చు. ముఖ్యంగా విచ్చలవిడితనంతో 18 నుంచి 35 ఏళ్లలోపు వారు ఇష్టారీతిగా డ్రైవింగ్ చేస్తున్నట్లు రవాణా శాఖాధికారుల చెబుతున్నారు. పోలీసులు, రవాణా శాఖ అధికారులు నమోదు చేసిన కేసుల్లో ఎక్కువగా నిర్లక్ష్యం వల్లనే ప్రమాదాలు జరిగినట్లు స్పష్టమవుతోంది.

ఇదేం వేగం!

వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారి, హంటర్ రోడ్డుపై ప్రజల ప్రాణాలు గాలిలో దీపాల్లా మారాయి. ఇంటిలో నుంచి బయటకు వచ్చి, మళ్లీ ఇంటికి వెళ్లగలమా అనే అపనమ్మకం ఏర్పడుతోంది. పగలు, రాత్రి రహదారులపై బైకులు, కారులు, లారీలు, టిప్పర్లు అతివేగంతో దూసుకెళ్తున్నాయి. ట్రిప్పులు ఎక్కువ తిరగాలని, నిద్రమత్తు, ఓవర్ స్పీడ్‌తో గమ్యానికి త్వరగా చేరాలని భారీ వాహనాల డ్రైవర్లు వేగాన్ని పెంచి ప్రమాదాలకు కారకులవుతున్నారు. నిబంధనలను తుంగలో తొక్కి, ఓవర్ లోడ్, ఓవర్ స్పీడ్‌లతో దూసుకుపోతున్న డ్రైవర్లకు బ్రేకులు వేయడంలో ఆర్టీఏ, పోలీస్ అధికారులు విఫలం అయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఫోన్‌లో మాట్లాడుతూ నడపొద్దు



సెల్‌ఫోన్లలో మాట్లాడుతూ, ఓవర్ స్పీడ్‌తో ఏకాగ్రత కోల్పోయిన వాహనదారులు వాహనాన్ని నడిపడం వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇయర్ ఫోన్లు పెట్టుకుని సంగీతం వింటూ డ్రైవ్ చేయడం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రధాన రహదారులపై వెనుకనుంచి వచ్చే వాహనాల హారన్ వినిపించకపోవడం వల్ల ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయి. రోడ్డుపై దృష్టి సారించి ఏకాగ్రతతో వాహనం నడిపితే గమ్యానికి క్షేమంగా చేరుకోవచ్చు.

– డాక్టర్ పుప్పాల శ్రీనివాస్, డీటీసీ, హనుమకొండ, వరంగల్

గ్రంథాలయ శాఖ ఏర్పాటు చేయాలి



అజీజ్‌ఖాన్‌ను సన్మానిస్తున్న భీమారం వాసులు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం భీమారంలో గ్రంథాలయ శాఖ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. ఈమేరకు నూతనంగా బాధ్యతలు చేపట్టిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భీమారంలో సుమారు 12వేల జనాభా ఉందని తెలిపారు. గ్రంథాలయం లేకపోవడం విద్యార్థులు, పాఠకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. గ్రంథాలయ సేవలు అందుబాటులో ఉన్నట్లయితే భీమారం, పలువేల్పుల, చింతగట్టు, ఎర్రగట్టు గుట్టతో పాటు ఇక్కడ ఉన్న కళాశాల విద్యార్థులకు ఎంతో ఉపయోగకమన్నారు. కార్యక్రమంలో నేతాజీ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం రమేష్, కబడ్డీ అసోసియేషన్ హనుమకొండ కార్యదర్శి సారంగపాణి, సలహాదారుడు లక్ష్మణ్, జిల్లా నెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సృజన్‌కుమార్, కబడ్డీ క్రీడాకారులు లింగమూర్తి, సంగాల విక్టర్ బాబు, ఆకుల కుమార్, పుల్లా కిషన్, సంగాల రాజు, అటికం శ్రావణ్, రవికుమార్, నరేష్, రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం



నయీంనగర్: ప్రజా ప్రభుత్వంలో ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగుతోందని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. గ్రేటర్ వరంగల్ 59వ డివిజన్ కనకదుర్గ కాలనీలో రూ.75 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, సైడ్ డ్రెయినేజీ నిర్మాణ పనులకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి ఎంపీ కావ్య శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు, సీనియర్ సిటిజన్లకు ఉపయోగపడే విధంగా పార్కు, రోడ్లు, డ్రెయినేజీలు నిర్మిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులు ఉద్యమాలకు సిద్ధం కావాలి



అభివాదం చేస్తున్న ఏబీఎస్ఎఫ్ నాయకులు

కేయూ క్యాంపస్: విద్యారంగ సమస్యలపై విద్యార్థులు ఉద్యమాలకు సిద్ధం కావాలని ఏబీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఇనుగుర్తి సుధాకర్ పిలుపునిచ్చారు. ఏబీఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవ సభను కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల సెమినార్ హాల్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఏబీఎస్ఎఫ్ అనేక పోరాటాలు చేస్తోందని వివరించారు. అంబేడ్కర్, పూలే ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్తున్నట్లు తెలిపారు. అడ్వకేట్ గంధం శివ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత స్థితిలోకి రావాలన్నారు. ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేష్, ఎస్ఎస్‌యూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సాయి, ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగుల పవన్‌కల్యాణ్, బాధ్యులు చెల్పూరి శ్రీకాంత్, బండారి పృథ్వీరాజ్, అర్షం చరణ్, గౌతమ్, విష్ణు, అజయ్, రవికిరణ్‌సాయి, వెంకటేష్, ప్రతాప్, సూర్య తదితరులు పాల్గొన్నారు. తొలుత క్యాంపస్‌లోని లైబ్రరీ నుంచి కామర్స్ సెమినార్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు.

భువనలక్ష్మి చిట్స్ వార్షికోత్సవం



వరంగల్: వరంగల్‌లోని భువనలక్ష్మి చిట్‌ఫండ్స్ 11వ వార్షికోత్సవాన్ని ఎంజీరోడ్డులోని కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ మూసిని నరేందర్ ఆధ్వర్యంలో ఏజెంట్లు, ఉద్యోగులు, చిట్ సభ్యులు కేక్ కట్‌చేసి సంబురాలు నిర్వహించారు. అనంతరం నరేందర్ మాట్లాడుతూ అందరి సహకారంలో 12వ సంవత్సరంలోకి సంస్థ అడుగు పెడుతోందని, ఈక్రమంలో ఏజెంట్లు, సభ్యుల సహకారంతో సంస్థను మరింత ముందుకు తీసుకుపోతామని చెప్పారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్‌శర్మ, దామోదర్ రెడ్డి, రాంకిషన్, రాజు, రాము, ఉమామహేశ్వర శర్మ, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను విస్మరిస్తున్న ప్రభుత్వం



నిరసన తెలుపుతున్న సంఘాల బాధ్యులు



నినాదాలు చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

విద్యారణ్యపురి: ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, కేజీబీవీల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించడం లేదని వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ బాధ్యులు విమర్శించారు. ఈమేరకు శనివారం చేపట్టిన ప్రభుత్వ పాఠశాలల బంద్ విజయవంతం అయిందని తెలిపారు. ప్రభుత్వ మర్కజీ హైస్కూల్, బాలికల హైస్కూళ్ల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వంశీకృష్ణ, రంజిత్, యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాలోతు రాజేష్‌నాయక్, ఆయా సంఘాల బాధ్యులు రమేష్, ప్రవీణ్, మహేష్, రాకేష్, కృష్ణమూర్తి, రాజు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడొద్దు

విద్యార్థుల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటమాడొద్దని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు. ఈమేరకు ప్రభుత్వ పాఠశాలల తరగతులను శనివారం బహిష్కరించారు. హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ హైస్కూల్ వద్ద నిరసన తెలిపారు. పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉటూరి ప్రణీత్, సంఘాల బాధ్యులు అరుణ్, వినయ్, రాజ్‌కుమార్, జస్వంత్, వంశీ, అఖిల్, పృథ్వీరాజ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంస్కారం అలవర్చుకోవాలి



మడికొండ: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే విద్యతో పాటు సంస్కారం, సమాజంపట్ల బాధ్యతతో ఉన్నతమైన జీవన నైపుణ్యాలు అలవర్చుకోవాలని సీడబ్ల్యూసీ సభ్యుడు కంజాపురం దామోదర్ సూచించారు. మడికొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సంధ్యారాణి అధ్యక్షతన సంస్కార వికాస శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడుతూ రోజు రోజుకు నేరాల్లో బాలల సంఖ్య పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు సెల్‌ఫోన్ వాడకాన్ని తగ్గించి పుస్తకాలపై దృష్టి సారించాలని కోరారు. జాతీయ అవార్డు గ్రహీత పరికిపండ్ల వేణు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, యోగా, మెడిటేషన్ కార్యక్రమాల్లో పాల్గొనాలని పేర్కొన్నారు. అనంతరం పాఠశాలలో ఉత్తమ సంస్కారం కలిగిన విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తేరాల యుగేందర్, సభ్యులు మూల ఐలయ్య, తాడురి లక్ష్మీనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులపై నిర్లక్ష్యం సరికాదు



కరీమాబాద్ పాఠశాలలో మాట్లాడుతున్న శరత్

ఖిలా వరంగల్: విద్యాశాఖను సీఎం రేవంత్‌రెడ్డి తన వద్ద పెట్టుకుని విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహించడం సరికాదని ఏఐఎస్ఎఫ్ జిల్లా ల్యాదల్ల శరత్ అన్నారు. వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపులో భాగంగా వరంగల్ కరీమాబాద్ బీరన్నకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు శనివారం బంద్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలు, గురుకులాలు, కేజీబీవీల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు చోటు చేసుకుంటున్నా ప్రభుత్వం చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఇస్సంపల్లి సాగర్, శివ, అభిరామ్, శ్రీధర్ పాల్గొన్నారు.

‘సైయెంట్’లో మాస్టర్ క్లాస్

మడికొండ: మడికొండ శివారులోని సైయెంట్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇన్‌స్పిరేషన్ టు ఎంట్రప్రెన్యూర్‌షిప్‌పై శనివారం మాస్టర్ క్లాస్ నిర్వహించారు. డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి స్కూల్ ఆఫ్ ఇన్నోవేషన్ అండ్ ఎంట్రప్రెన్యూవర్ షిప్ (బీవీఆర్ సైంట్) సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి 25 పైగా ఇంజనీరింగ్ కళాశాలల నుంచి 120కి పైగా విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. ఈ సందర్భంగా బీవీఆర్ సైంట్ సీఈఓ డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ యువ ఇంజనీరింగ్ విద్యార్థులను వ్యవస్థాపన దిశగా ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



ఖిలా వరంగల్: బొల్లికుంట రైతు భవనంలో..



మడికొండ: ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న నాయకులు

ఖిలా వరంగల్: రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మండల పీఏసీఎస్ సొసైటీ అధ్యక్షుడు కేడల జనార్దన్ అన్నారు. మహబూబాబాద్‌నగర్ జిల్లాలో రైతు పండుగ వేదికపై సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని బొల్లికుంట రైతు భవనంలో వ్యవసాయ శాఖ నేతృత్వంలో రైతులు శనివారం వీక్షించారు. కార్యక్రమంలో ఏఓ రవీందర్‌రెడ్డి, ఏఈఓ చంద్రకాంత్, సత్యప్రకాశ్, సొసైటీ వైస్ చైర్మన్ సోల్తి భూమాత, రైతులు పాల్గొన్నారు.

మడికొండ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని మడికొండలోని రైతు వేదికలో వీడియో కన్ఫరెన్స్‌లో నాయకులు, వ్యవసాయ అధికారులు, రైతులు శనివారం వీక్షించారు. మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, పీఏసీఎస్ డైరెక్టర్ దువ్వ శ్రీకాంత్, మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, బైరి కొంరయ్య, దువ్వ విజయ్, కుర్ల మోహన్, వస్కుల శంకర్, నాగరాజు, శ్రీనివాస్, సతీష్, గౌతమ్, ఏఈఓ సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు శోచనీయం

వరంగల్ అర్బన్: బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు సరికాదని, వెంటనే ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ నాయకురాలు పుష్పలతయ డిమాండ్ చేశారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు.

టీఎన్జీఓఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడి ఉద్యోగ విరమణ



శ్యాంసుందర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, ఉద్యోగ సంఘాల నాయకులు

హన్మకొండ అర్బన్: టీఎన్జీఓఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, సుదీర్ఘకాలం వైద్య ఆరోగ్యశాఖలో సేవలందించిన శనిగరపు శ్యాంసుందర్ ఉద్యోగ విరమణ అభినందన సభ హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో శనివారం జరిగింది. ఈ సందర్భంగా పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ ఉద్యోగ బాధ్యతలతో పాటు జిల్లా, రాష్ట్ర సంఘాలకు సంబంధించిన పనులను సమన్వయంతో చేసే శ్యామ్ అందరికి అజాత శత్రువని ప్రశంసించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం శ్యాంసుందర్ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో టీఎన్జీఓఎస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజీబ్, మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే శ్రీరాం భద్రయ్య, జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, ఈవీ శ్రీనివాస్‌రావు, కేంద్ర సంఘం నేతలు, తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీ కడియం కావ్య, చిత్రంలో కలెక్టర్ ప్రావీణ్య, తదితరులు

- ఎంపీ డాక్టర్ కడియం కావ్య

హన్మకొండ అర్బన్: పిల్లలను సోషల్ మీడియాకు దూరంగా ఉంచాలని వరంగల్ ఎంపీ, డాక్టర్ కడియం కావ్య అన్నారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో బాలల హక్కుల వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా స్థాయి వేడుకలు మహిళా, శిశు దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీ కవిత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సంవత్సరం బాలల హక్కుల థీమ్ ‘బాలల భవిష్యత్ కోసం బాలల హక్కుల కోసం నిలబడదాం’ అన్నారు. ముఖ్యంగా బాలల ఆరోగ్యం విషయంలో శ్రద్ధ అవసరమన్నారు. పిల్లలకు చైల్డ్ లైన్ గురించి, 1098 నంబర్ గురించి అవగాహన కల్పించాలని.. కార్యక్రమంలో పాల్గొన్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బాలల హక్కుల వారోత్సవాల్లో నిర్వహించే కార్యక్రమాలు వారిలో అవగాహన పెంపొందిస్తాయన్నారు. కలెక్టర్ ప్రావీణ్య చిన్నారులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి హాజరైన చెస్ గ్రాండ్ మాస్టర్ అర్జున్ మాట్లాడుతూ.. పిల్లలో ప్రతిభకు పదును పెడితే వారి నుంచి అద్భుతాలు చూస్తామన్నారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి ప్రోత్సాహక చెక్కులు అందజేశారు. జిల్లా సంక్షేమ అధికారి జయంతి, రెడ్‌క్రాస్ ప్రతినిధి ఈవీ శ్రీనివాస్‌రావు, కార్పొరేటర్ రావుల కోమల, సీడీపీఓలు స్వాతి, భాగ్యలక్ష్మి, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక మాస పూజలు

మడికొండ: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 46వ డివిజన్ మడికొండలోని మెట్టు రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాసం చివరి శనివారం ఉదయం సంప్రోక్షణ నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రభాతసేవతో వైభవంగా గోపూజ, అఖండ దీపారాధన, ప్రాతఃకాల మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం చేశారు. రామాలయంలో స్వామివారికి విశేష అర్చనలు జరిపించారు. సాయంకాలం సంధ్యా సమయంలో హరిహరులకు ఆకాశ దీపోత్సవం శివాలయంలో ప్రదోషకాల రుద్రాభిషేకం, నీరాజన మంత్రపుష్పం, నక్షత్ర హారతి, చతుర్వేద స్వస్తి, రాజోపచార పూజలు, పవళింపు సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణధికారి శేషుభారతి, శివాలయం చైర్మన్ పైడిపాల రఘుందర్, ధర్మకర్తలు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కోటి దీపోత్సవం, జ్వాలా తోరణం

వరంగల్ చౌరస్తా: వరంగల్ గిర్మాజీపేట గోవింద రాజ స్వామి దేవాలయానికి సమీపంలోని గోశాలలో శనివారం సాయంత్రం కార్తీకమాస ఉత్సవాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా అనంత కోటి దీపోత్సవం, జ్వాలా తోరణం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఏసీపీ నందిరాం నాయక్, వరంగల్ తహసీల్దార్ మహమ్మద్ ఇక్బాల్, ఆలయ అర్చకులు వరయోగుల లక్ష్మణస్వామి, వరయోగుల శ్రీనివాస స్వామి, ప్రసాద్, మురళీకృష్ణ, టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, మాజీ కార్పొరేటర్ జారతి రమేష్, సదానందం పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ప్లాటినం జూబ్లీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

వరంగల్ చౌరస్తా: వరంగల్ అబ్బనికుంటలోని ప్లాటినం జూబ్లీ హైస్కూల్ 70 ఏళ్లు పూర్తి చేసుకున్నందున రెండు రోజుల కార్యక్రమాల్లో భాగంగా శనివారం మొదటిరోజు పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. పాఠశాల ప్రిన్సిపాల్ జగదీష్ పేచే జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. 1953 నుంచి 2024 వరకు పూర్వ సన్నివేశాలు, ఫొటో ఎగ్జిబిషన్, వీడియోలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులందరిని ఒకచోట సమ్మేళనం చేయడం అనేది చాలా సంతోషకరమైన విషయమన్నారు. కార్యక్రమంలో ఏకేఎస్ఐ చైర్మన్ సిరాజ్ వస్తాని, ప్రతినిధులు ఫర్హాద్ మర్చంట్, హెడ్ ఆఫ్ అకడమిక్ డాక్టర్ త్రిషసేన్, రీజినల్ హెడ్ డాక్టర్ ఇక్బాల్ సమ, కమ్యూనికేషన్ హెడ్ దినా శ్యాముల్, తారా మీనన్, సలీమా విరాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం

వరంగల్ చౌరస్తా: అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల, బోధన ఆస్పత్రి ఆధ్వర్యంలో వరంగల్ బట్టలబజారులోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ హరికిషన్, క్యాంపు ఇన్‌చార్జ్ తాండ్ర ఈశ్వర్, వయోవద్ధుల సంక్షేమ సంస్థ జిల్లా అధ్యక్షుడు కొన్రెడ్డి మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల సదానందం, బీజేపీ నాయకుడు గందె నవీన్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఈశ్వర్, హరీష్, నాగరాజు, అఖిల, నిఖిల, చైతన్య భార్గవి, వయోవృద్ధుల సంఘం ప్రతినిధులు రాజేంద్రప్రసాద్, రాజమౌళి, సత్యనారాయణ, జోగిరెడ్డి, నిజాముద్దీన్, సూర్యనారాయణ, గోవర్ధన్, వెంకటస్వామి, సుధాకర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నెలరోజుల పాటు ఉచిత పరీక్షలు

హసన్‌పర్తి: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నెలరోజుల పాటు ఉచిత మధుమేహ వైద్య పరీక్షలు నిర్వహించినట్లు రీజియన్ చైర్మన్ జన్నపురెడ్డి రాజిరెడ్డి తెలిపారు. హసన్‌పర్తి శాఖ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి దేవాలయ సమీపంలో ఉచిత మధుమేహ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ నెలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నెలరోజుల పాటు రెండు వేల మందికి పరీక్షలు నిర్వహించినట్లు వివరించారు. క్లబ్ అధ్యక్షుడు కృపాకర్ అధ్యక్షతన శనివారం జరిగిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ అజిత్‌కుమార్, జోన్ చైర్మన్ భాస్కర్, రావు, డాక్టర్ గొరిశెట్టి సత్యనారాయణ, కార్పొరేటర్ శివకుమార్, క్లబ్ సభ్యులు గోపరాజు యాదగిరి, శ్రీనివాస్, మారం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి స్థలం కేటాయించాలి

వరంగల్ / ఖిలా వరంగల్: హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను కాంగ్రెస్ నాయకులు గద్దం యుగేందర్, నాగపూరి క్రాంతికిరణ్ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈమేరకు వరంగల్ ఉర్సు దర్గా ఎదురుగా ఉన్న ఆటో స్టాండ్ వద్ద అన్నపూర్ణ క్యాంటీన్ ఏర్పాటు చేయాలని, ఉర్సుగుట్ట రిజిస్ట్రేషన్ కార్యాలయం పక్కన ఖాళీ స్థలాన్ని తహసీల్దార్ కార్యాలయానికి కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. ఫోర్ట్‌రోడ్డులోని అద్దె భవనంలో తహసీల్దార్ కార్యాలయం కొనసాగుతోందన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

హసన్‌పర్తి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి హసన్‌పర్తి మండలం భీమారంలో రైతు వేదిక కేంద్రం వద్ద శనివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ప్రభుత్వం నెరవేర్చిందని గుర్తుచేశారు. రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీతో పాటు సన్నరకానికి రూ.500 బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆత్మకూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి, కాంగ్రెస్ హసన్‌పర్తి మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు కనపర్తి కిరణ్, చంటిరెడ్డి, గోవర్ధన్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



కాజీపేట: పారిశుద్ధ్య సిబ్బందికి దుస్తులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ రవీందర్‌యాదవ్



వరంగల్: కార్మికులకు యూనిఫాం అందజేస్తున్న కార్పొరేటర్ వస్కుల బాబు



యూనిఫాం పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ అనిత



దుస్తులు అందజేస్తున్న కార్పొరేటర్ శివకుమార్

మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫాంలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా డివిజన్ల కార్పొరేటర్ల చేతుల మీదుగా శనివారం అందజేశారు. ఈమేరకు కార్మికుల సేవలను పలువురు కొనియాడారు. – సాక్షి నెట్‌వర్క్